## చౌటుప్పల్‌లో ఉచిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



**చౌటుప్పల్, సెప్టెంబర్ 11,(నవగీతం):** పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించడంతో పాటు ప్రజల్లో పర్యావరణంపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో "మట్టి వినాయకుడిని పూజిద్దాం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం" అనే నినాదంతో భారత్ సేవా సహకార ఫోరం ఆధ్వర్యంలో ఉచిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం చౌటుప్పల్ పురపాలక కేంద్రంలో నిర్వహించారు.తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్ సౌజన్యంతో, భారత్ సేవా సహకార ఫోరం ట్రస్ట్ సభ్యులు బొబ్బిళ్ళ మురళి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉచిత మట్టి వినాయక విగ్రహాలను చౌటుప్పల్ పురపాలక మాజీ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు చేతుల మీదుగాప్రజలకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ. వినాయక చవితి సందర్భంగా పర్యావరణానికి హాని కలిగించే రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా సహజసిద్ధమైన మట్టి వినాయక విగ్రహాలను పూజించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. మట్టి విగ్రహాలను వినియోగించడం వల్ల నీటి కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు ప్రకృతి పరిరక్షణకు దోహదపడుతుందని తెలిపారు."మట్టి వినాయకుడిని పూజిద్దాం మన పర్యావరణాన్ని కాపాడుకుందాం" అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ట్రినిటీ విద్యాలయ డైరెక్టర్ అండ్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీమతి ఉజ్జిని మంజుల,చౌటుప్పల్ మున్సిపల్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు నరసింహ గౌడ్ సీతారామచంద్రస్వామి దేవాలయ కమిటీ ధర్మకర్తలు, ఆవుల యేసు యాదవ్, వరకాల రవి గౌడ్ ,బొబ్బిళ్ళ సామ్రాట్ తదితరులు పాల్గొన్నారు.

## అర్బన్ బ్యాంకుల్లో దేశంలోనే గాయత్రి బ్యాంక్

రెండవ స్థానం 86 బ్రాంచీలు, రూ.4628 కోట్ల వ్యాపారం


9.55 లక్షల మంది ఖాతాదారులతో 27 ఏళ్లలోకి ఎంట్రీ

బ్యాంక్ సీఈఓ వనమాల శ్రీనివాస్ వెల్లడి




**జగిత్యాల, సెప్టెంబర్ 11,(నవగీతం):** అర్బన్ బ్యాంకుల్లో భారత దేశంలోనేది గాయత్రి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ రెండవ స్థానంలో నిలిచిందని గాయత్రి కో ఆపరేటివ్ బ్యాంక్ సీఈఓ వనమాల శ్రీనివాస్ అన్నారు.బ్యాంక్ 26వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం జగిత్యాలలోని బ్యాంక్ ప్రధాన కార్యాలయ ఆవరణలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బ్యాంక్ ముఖ్య కార్యనిర్వహణాధికారి వనమాల శ్రీనివాస్ మాట్లాడుతూ, 2000 సంవత్సరంలో జగిత్యాల కేంద్రంగా చిన్న యూనిట్ బ్యాంక్‌గా ప్రారంభమైన గాయత్రి బ్యాంక్, 26 ఏళ్ల నిరంతర కృషి, ఖాతాదారుల నమ్మకంతో ఈ రోజు ఒక బృహత్తర సంస్థగా ఎదిగిందని అన్నారు.ప్రస్తుతం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో 86 బ్రాంచీల నెట్‌వర్క్‌తో రూ.4628 కోట్ల వ్యాపారాన్ని సాధించామని, తెలంగాణ రాష్ట్రంలో కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకుల్లో మొదటి స్థానంలో, దక్షిణ భారతదేశ స్థాయిలో రెండవ స్థానంలో నిలిచామని తెలిపారు. అంతేకాకుండా 9,55,597 మంది వినియోగదారులతో దక్షిణ భారతదేశంలోనే అత్యధిక కస్టమర్ బేస్ కలిగిన కో-ఆపరేటివ్ బ్యాంక్‌గా మొదటి స్థానానికి చేరుకోవడం గర్వకారణమని పేర్కొన్నారు.ఈ విజయం వెనుక బ్యాంక్ సభ్యులు, ఖాతాదారులు, సిబ్బంది, అధికారుల కృషి, మీడియా, శ్రేయోభిలాషుల ప్రోత్సాహం ఉందని, వారందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నానని శ్రీనివాస్ అన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని ఆధునిక బ్యాంకింగ్ సేవలతో ఖాతాదారులకు చేరువ కావడమే లక్ష్యమని స్పష్టం చేశారు.కార్యక్రమంలో భాగంగా గాయత్రి నిర్భయ ఖాతా కలిగి ఉండి ప్రమాదంలో మరణించిన కీ.శే. అవారి అమరేందర్‌కు చెందిన రూ.2 లక్షల బీమా చెక్కును ఆయన కుమారుడు, నామిని అయిన అవారి అక్షయ్ కుమార్‌కు సీఈఓ చేతుల మీదుగా అందజేశారు.ఈ కార్యక్రమంలో బ్యాంక్ జనరల్ మేనేజర్లు ఎం.వి.జె. శాస్త్రి, శ్రీలత, అసిస్టెంట్ జనరల్ మేనేజర్లు సి.హెచ్. సత్యనారాయణ, బింగి తిరుపతి, బి. ప్రవీణ్ కుమార్, ఆర్.కె.వి. అరుణ్ కుమార్‌తో పాటు పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి పోటీలకు కొడిమ్యాల విద్యార్థులు




**కొడిమ్యాల,సెప్టెంబర్ 11(నవగీతం)** ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన కొడిమ్యాల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 10న నిర్వహించిన మండల స్థాయి పోటీల్లో అండర్--14 క్రికెట్‌లో ఉమేష్, హర్షవర్ధన్, అండర్--17 బాలుర క్రికెట్‌లో డి. రోహిత్, విష్ణువర్ధన్, అండర్--17 బ్యాడ్మింటన్‌లో వాల్మీకి, అండర్--14 బ్యాడ్మింటన్‌లో జక్కని గౌతమ్, రామకృష్ణ, అండర్--14 బాలికల బ్యాడ్మింటన్‌లో గౌతమి, చెస్‌లో డి. అర్చన, అండర్--17 బాలికల క్రికెట్‌లో ఖుష్బూ, బోయిని హారిక ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు ఆచి విజయేంద్ర, ఫిజికల్ డైరెక్టర్ బూట్ల రాజమల్లయ్య తెలిపారు.ఈ నెల 16 నుంచి జగిత్యాల జిల్లా కేంద్రంలోని స్వామి వివేకానంద స్టేడియంలో నిర్వహించనున్న జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో విద్యార్థులు పాల్గొననున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

## ప్లాస్టిక్ రహిత వినాయక మండపాలకు స్నేహాలయ పురస్కార్






**మెట్‌పల్లి,సెప్టెంబర్11,(నవగీతం):**వినాయక నవరాత్రి ఉత్సవాలను పర్యావరణహితంగా నిర్వహించేందుకు స్నేహాలయ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వినాయక మండపాల్లో మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్టించడంతో పాటు నవరాత్రి ఉత్సవాల సమయంలో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నివారించే మండప నిర్వాహకులను అభినందిస్తూ "స్నేహాలయ పురస్కార్" అవార్డును అందజేయనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు కోట కిరణ్ కుమార్ తెలిపారు.మండపాల్లో ప్లాస్టిక్ కవర్లు, క్యారీ బ్యాగులు, ప్లాస్టిక్ గ్లాసులు, పేపర్ ప్లేట్లు, స్వీట్ కప్పులు, టీ కప్పులు తదితరాలను ఉపయోగించకుండా,కేవలం భక్తి పాటలతో ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలను నిర్వహించే మండప నిర్వాహకులకు ఈ పురస్కారం అందజేయనున్నట్లు పేర్కొన్నారు."ప్రజాహితం మా పథం" అనే నినాదంతో పర్యావరణ పరిరక్షణ, సామాజిక బాధ్యతపై ప్రజల్లో అవగాహన కల్పించడమే తమ లక్ష్యమని తెలిపారు. వినాయక మండపాల నిర్వాహకులు ఈ కార్యక్రమానికి సహకరించి ప్లాస్టిక్ రహిత ఉత్సవాలను నిర్వహిస్తూ అందుకోవాలని కోట కిరణ్ కుమార్ కోరారు.

## ప్రాచీన విజ్ఞానాన్ని గుర్తించండి తాళపత్రాలు, గ్రంథాలు, శాసనాలు సేకరించాలి

డిజిటలైజ్ చేసేందుకు సహకరించాలి అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే





**కరీంనగర్, సెప్టెంబర్11,(నవగీతం)** ప్రాచీన విజ్ఞానాన్ని భద్రపరచడానికి, డిజిటలైజ్ చేసేందుకు జ్ఞాన్ భారతం మిషన్ కార్యక్రమాన్ని భారత సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ప్రవేశపెట్టిందని, ఇందులో భాగంగా జిల్లాకు చెందిన ప్రాచీన తాళపత్రాలు, గ్రంథాలు, శాసనాలను గుర్తించాలని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు.జ్ఞాన్ భారతం మిషన్ లో భాగంగా విద్య, పురావస్తు, దేవాదాయ, మైనారిటీ,టూరిజం, సమాచార తదితర శాఖల అధికారులతో కలెక్టరేట్ లోని అడిషనల్ కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు.ఇది సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఉన్న ప్రాచీన తాళపత్రాలు, గ్రంథాలు లోహాలపై, రాతిపై వివిధ భాషల్లో చెక్కిన పురాతన రచనలు, పద్యాలు వంటివి సేకరించాలని సూచించారు.కరీంనగర్ జిల్లాలో మరుగున పడిన అమూల్యమైన గ్రంథాలు, శాసనాలు వంటివి సేకరించాలని సూచించారు. ప్రార్థన మందిరాలు, చారిత్రక ప్రాంతాల్లో ఈ అమూల్య సంపద ఉండే అవకాశం ఉంటుందని, 70 సంవత్సరాల క్రితం నాటి ఏ గ్రంథాలనైనా గుర్తించాలని లేదా సేకరించాలని సూచించారు.సంస్కృతం, ఉర్దూ, తెలుగు, అరబిక్, పర్షియన్ తదితర భాషల్లో రాగి వంటి లోహాలు, తాటాకులపై రాసిన గ్రంథాలను గుర్తించి డిజిటలైజ్ చేయడం ఈ కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు. భాషా పండితులు, పురావస్తు, టూరిజం, దేవాదాయ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పురాతన విజ్ఞానాన్ని గుర్తించి భద్రపరిచేందుకు సమన్వయంతో పని చేయాలని అన్నారు. జిల్లాకు చెందిన ప్రజలు ఎవరైనా ఇలాంటి పురాతన అమూల్య గ్రంథాలు, శాసనాలకు సంబంధించిన సమాచారాన్ని 9640967943 సెల్ నెంబర్ కు తెలియజేయాలని కోరారు.ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి స్వామి, విద్య దేవాదాయ, ఆర్కియాలజీ, టూరిజం, మైనారిటీ, సమాచార తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## విశ్వబ్రాహ్మణులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

అమావాస్య యజ్ఞ మహోత్సవంలో పాల్గొన్న శ్రీనివాసచారి అనంతలక్ష్మి దంపతులు




**జగిత్యాల సెప్టెంబర్ 11( నవగీతం)** అఖిల విశ్వ గాయత్రి పరివార్ జగిత్యాల కొమురవెల్లి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో విశ్వ గాయత్రి యజ్ఞ మహోత్సవం కమిటీ సభ్యులు అమావాస్య నాడు పౌర్ణమి నాడు నిర్వహిస్తున్నారు అమావాస్య యజ్ఞ మహోత్సవంలో బొందుకూరి శ్రీనివాసచారి అనంతలక్ష్మి దంపతులు పాల్గొన్నారు. మరియు విశ్వబ్రాహ్మణులు బైంసా వాస్తవ్యులు బ్రహ్మశ్రీ నాగమణి లింగాచార్యు చారి సతీమణి విఠలాచారి సతీమణి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు అఖిల భారతీయ విశ్వకర్మ మహాసభ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ల అధ్యక్షులు బొందుకూరి శ్రీనివాస్ చారి మాట్లాడుతూ యజ్ఞం లో విశ్వబ్రాహ్మణ కుల బాంధవుల భారతదేశంలో ఉన్న స్వర్ణకార కంచరి వాళ్లు కమ్మరి వాళ్ళు వడ్రంగి వాళ్ళు శిల్పి వాళ్లు కు చెందిన చేతివృత్తులు తక్కువ కావడంతో విశ్వకర్మ వాళ్ళు జీవనం గడవటం కష్టంగా ఉన్నందున కేంద్ర ప్రభుత్వము రాష్ట్ర ప్రభుత్వాలు విశ్వబ్రాహ్మణ కులాలకు జీవన అభివృద్ధి కొరకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని మరియు 50 సంవత్సరాలు నిండిన వయసు వారికి రూ. 8000, ఫించన్ అందచేయాలి అన్నారు. ఈ యజ్ఞ మహోత్సవంలో కమిటీ నిర్వాహకులు అశోక్ జి కనపర్తి నాగభూషణ చారి కనికరపు లచ్చన్న కొమరవెల్లి లక్ష్మి సుధాకర్ దంపతులు ఎల్లెందుల పురుషోత్తం చారి దంపతులు,భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

నో మ్యాపింగ్, అనామలీస్ ఓటర్లకు నోటీసులు వ్యక్తిగతంగా అందజేయాలి

అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం: జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్





**జగిత్యాల/ధర్మపురి, సెప్టెంబర్11,(నవగీతం):** ధర్మపురి మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను శుక్రవారం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పరిశీలించారు.ఈ సందర్భంగా ఎస్ఐఆర్‌లో భాగంగా జారీ చేస్తున్న నోటీసులు, వాటిపై నిర్వహిస్తున్న విచారణ ప్రక్రియ, ఓటర్ల నుంచి సేకరిస్తున్న ఆధారాలు, ఆ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న విధానంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఎస్ఐఆర్ నోటీసులపై విచారణను పూర్తి స్థాయిలో, నిబంధనలకు అనుగుణంగా పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.ఓటర్ల నుంచి సేకరించిన ఆధారాలు, సంబంధిత వివరాలను ఆన్‌లైన్‌లో సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. వివరాల నమోదులో ఎలాంటి పొరపాట్లు, తేడాలు చోటుచేసుకోకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు.నో మ్యాపింగ్ ఓటర్లు, అనామలీస్ ఓటర్లకు సంబంధించిన అన్ని నోటీసులను సంబంధిత ఓటర్లకు వ్యక్తిగతంగా అందజేయాలని ఆదేశించారు. నోటీసుల జారీ, అందజేత, విచారణ, ఓటర్ల నుంచి ఆధారాల సేకరణ, ఆన్‌లైన్‌లో వివరాల నమోదు తదితర ప్రతి దశను ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు.అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు కూడా ఓటు హక్కును కోల్పోకుండా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని అన్నారు. అదే సమయంలో అనర్హమైన లేదా తప్పుగా నమోదైన వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించి సరిదిద్దేలా చర్యలు చేపట్టాలని సూచించారు."అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే మన లక్ష్యం. ఎస్ఐఆర్ ప్రక్రియలో పారదర్శకత, నిష్పక్షపాతంగా వ్యవహరించడం, నిబంధనలను కచ్చితంగా పాటించడం అత్యంత ముఖ్యమని" జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పేర్కొన్నారు.అనంతరం 2027 లో రానున్న గోదావరి పుష్కరాల నేపథ్యంలో ధర్మపురి లోని గోదావరి నది వద్ద జరుగుతున్న పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పనులను వేగవంతంగా, ప్రణాళికలకు అనుగుణంగా భక్తులకు, విఐపి లకు అసౌకర్యం కలుగకుండా పుష్కర ఘాట్లను నిర్మించాలని ఆదేశించారు.ఈ పరిశీలనలో జగిత్యాల ఆర్డీఓ మధుసూదన్, ధర్మపురి మున్సిపల్ చైర్మన్ నాగ లక్ష్మీ,, తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, పంచాయతీరాజ్ ఇంజనీర్ శాఖ అధికారులు బిఎల్ వో లు తదితరులు పాల్గొన్నారు.

## మట్టి గణపతులను పూజిద్దామంటూ విద్యార్థుల ర్యాలీ.




**ఇల్లంతకుంట, సెప్టెంబర్ 11 (నవగీతం):** మట్టి గణపతులను పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం అంటూ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలోని వాణి నికేతన్ హై స్కూల్ విద్యార్థులు శుక్రవారం స్వయంగా మట్టితో తయారుచేసిన గణపతి విగ్రహాలను పట్టుకొని పాఠశాల నుండి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు తయారుచేసిన మట్టి గణపతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కరస్పాండెంట్ తూముకుంట శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ తో తయారుచేసిన విగ్రహాలను చెరువులు కుంటలలో నిమజ్జనం చేయడం ద్వారా నీరు కలుషితం అవుతుందన్నారు. ఈ నీటిని త్రాగడం ద్వారా పశువులు, జలచరాలు అనారోగ్యం బారిన పడుతున్నాయన్నారు. మట్టి వినాయకులు అయితే మట్టిలోనే కలిసిపోతుందన్నారు. ప్రజల్లో అవగాహన పెంచడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారుఅనంతరం పాఠశాల ఆవరణలో గణపతి ఆకృతిలో విద్యార్థుల ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో ప్రిన్సిపల్ తూముకుంట శ్రీనిధి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రాజు, సంతోష్, రమేష్, తిరుపతి, రాజు, శోభ, కళ్యాణి, రేణుక, సునీత, స్వాతి, మహాలక్ష్మి, లావణ్య, సుమంగళి, సునంద, మౌనిక, రేణుక, జలజ, శాంత, పద్మ, ఉష, శమిమాల తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులారా.. లక్ష్యసాధన దిశగా అడుగులు వేయండి

జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వై.రమేష్ బాబు




**కొడిమ్యాల, సెప్టెంబర్ 11.( నవగీతం )** కొడిమ్యాల మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన 'వెల్‌కమ్ పార్టీ--2026' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి(డీఐఈఓ) వైరమేష్ బాబు పాల్గొన్నారు.అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులు తమ స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుని, పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఇంటర్మీడియట్ అనేది విద్యార్థి జీవితంలో అత్యంత కీలకమైన దశ అని, ఈ సమయంలో తీసుకునే నిర్ణయాలే భవిష్యత్తును నిర్దేశిస్తాయని తెలిపారు. విద్యార్థులు కేవలం మార్కులకే పరిమితం కాకుండా జ్ఞానం, క్రమశిక్షణ, నైతిక విలువలు, సమయపాలన, మంచి ప్రవర్తనను అలవర్చుకోవాలని సూచించారు. మాదకద్రవ్యాలు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండటంతో పాటు అనవసరమైన సోషల్ మీడియా వినియోగాన్ని తగ్గించి.. ఆ సమయాన్ని చదువు, క్రీడలు, సృజనాత్మక కార్యక్రమాలు, సామాజిక సేవకు వినియోగించుకోవాలని కోరారు. తల్లిదండ్రులు, అధ్యాపకులు విద్యార్థులపై ఎన్నో ఆశలు పెట్టుకుంటారని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ప్రతీ విద్యార్థిపై ఉందన్నారు.కార్యక్రమంలో పాల్గొన్న మరో అతిథి, కొడిమ్యాల సర్పంచ్ గడ్డం జీవన్ రెడ్డి మాట్లాడుతూ..ప్రభుత్వం ఇంటర్మీడియట్ విద్యకు విస్తృత సౌకర్యాలు కల్పిస్తోందని, కళాశాల అభివృద్ధికి తనవంతు పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ పి. గోపాల్ నూతన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ విద్యా, సాంస్కృతిక, క్రీడా, సహపాఠ్య కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని తమలోని ప్రతిభను వెలికితీసుకోవాలని సూచించారు.?అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, వినోద ఘట్టాలు ఆహూతులను ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

